అందరికీ న్యాయం జరిగేలా..

విస్తృత అవకాశాలకు వేదికగా నిలుస్తోన్న చదువుల్లో న్యాయవిద్య ఒకటి. ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తైన తర్వాత లా కోర్సుల్లో చేరిపోవచ్చు. జాతీయ స్థాయిలో పలు సంస్థలు న్యాయవిద్యకు పేరొందాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ మేటి సంస్థలెన్నో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఏపీ లాసెట్, తెలంగాణ లాసెట్ ప్రకటనలు వెలువడ్డాయి.

ప్రస్తుత పరిణామాలు న్యాయవిద్య పరిధిని విస్తరిస్తున్నాయి. సమస్యలు ఏవైనప్పటికీ పరిష్కారం చూపేది న్యాయవిద్య అభ్యసించిన వాళ్లే. ప్రశ్నించే తత్వం, న్యాయం చేయాలనే తపన, సమాజంలో మార్పు దిశగా ప్రయత్నం చేయాలనుకున్నవారు లా బాట పట్టవచ్చు. ఇంటర్ తర్వాత నేరుగా ఇంటిగ్రేటెడ్ విధానంలో డిగ్రీ, ఎల్ఎల్బీ రెండూ ఒకేసారి చదువుకోవచ్చు. అలా వద్దనుకుంటే ఏదైనా డిగ్రీ పూర్తిచేసి, ఆ తర్వాత ఎల్ఎల్బీలో చేరవచ్చు. అయితే న్యాయవిద్యలో ఆసక్తి ఉన్న ఇంటర్ విద్యార్థులు డిగ్రీతో కలిపి ఎల్ఎల్బీలో చేరడమే మంచిది. ఇలా చేస్తే ఐదేళ్లకే కోర్సు పూర్తవుతుంది. అదే డిగ్రీ తర్వాత మొత్తం ఆరేళ్లు (విడిగా డిగ్రీకి మూడేళ్లు, ఎల్ఎల్బీకి మరో మూడేళ్లు) పడుతుంది. ఇంటర్ తర్వాత చేరడం వల్ల ఏడాది సమయం ఆదాతో పాటు సబ్జెక్టుపై పట్టు పెంచుకోవచ్చు. జాతీయ, ప్రాంతీయ సంస్థలు డిగ్రీతో ఎల్ఎల్బీ కోర్సులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకోసం జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.



కోరుకున్న డిగ్రీతో...

బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ...వీటిలో కోరుకున్న కాంబినేషన్‌తో ఎల్ఎల్బీ చదువుకోవచ్చు. ఎక్కువ సంస్థల్లో బీఏ ఎల్ఎల్బీ కోర్సు అందుబాటులో ఉంటోంది. డిగ్రీ కోర్సు ఏదైనప్పటికీ వీటిలో లా సిలబస్ ఇంచుమించు ఒకేలా ఉంటుంది. బీబీఏలో మేనేజ్‌మెంట్, బీఏలో సోషల్ సైన్సెస్, బీఎస్సీలో సైన్స్ అంశాలు, బీఎస్‌డబ్ల్యూలో సోషల్ వర్కుకు ప్రాధాన్యం కల్పిస్తారు. ఐదేళ్లలో పది సెమిస్టర్లతో డిగ్రీతోపాటు ఎల్ఎల్బీ పూర్తవుతుంది. అనంతరం ఉద్యోగం లేదా ఉన్నత విద్య (ఎల్ఎల్ఎం) దిశగా అడుగులేయవచ్చు. ఆరేళ్ల వ్యవధితో బీటెక్ తోపాటు ఎల్ఎల్బీ చదువుకునే అవకాశం ఉంది. యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్ (యూపీఈఎస్) బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఎల్ఎల్బీ సంయుక్తంగా అందిస్తోంది. సైబర్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా- ఈ రెండింటిలో ఏదో ఒకటి స్పెషలైజేషన్‌గా ఎంచుకోవచ్చు. ఈ కోర్సులో చేరడానికి ఇంటర్ ఎంపీసీ విద్యార్థులే అర్హులు.

ఆకర్షణీయ వేతనాలతో...

జాతీయ స్థాయి సంస్థల్లో న్యాయవిద్య కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఆకర్షణీయ వేతనాలతో అవకాశాలు పొందుతున్నారు. బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, వస్తు తయారీ పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్, బహుళజాతి కంపెనీలు, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలూ, కన్సల్టింగ్ సంస్థలూ, అకౌంటింగ్ కంపెనీల్లో ఉపాధి లభిస్తుంది. లా గ్రాడ్యుయేట్లను జ్యుడీషియల్ క్లర్కులుగానూ తీసుకుంటున్నారు. లీగల్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్‌లో అవకాశాలు పెరుగుతున్నాయి. ఉన్నత విద్యతో బోధన రంగంలోనూ రాణించవచ్చు. ఎన్జీవోలు, చైల్డ్ రైట్స్, హ్యూమన్ రైట్స్ కమిషన్లు, కార్పొరేట్ లీగల్ సెల్స్ ..ఇవన్నీ కొలువుల వేదికలే. కంపెనీలకు సేవలు అందించడానికి కార్పొరేట్ లీగల్ ఫర్మ్‌లు సైతం ఉన్నాయి. వీటిలో పెద్ద మొత్తంలో వేతనాలు చెల్లిస్తున్నారు.

దేశవ్యాప్తంగా వివిధ స్థాయుల్లో కోట్ల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, కాపీ రైట్ కేసులు పెరుగుతున్నాయి. సాంకేతిక వృద్ధి లీగల్ పట్టభద్రులకు అవకాశాలు కల్పిస్తోంది. సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్), లేబర్ ఆఫీసర్ పోస్టులకు లా గ్రాడ్యుయేట్లు పోటీ పడవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఇంటర్పోల్ క్రిమినల్ కోర్టుల్లో సేవలు అందించవచ్చు. ఆర్మీలో జడ్జ్ అడ్వొకేట్ జనరల్ పోస్టులకు లా గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రైవేటు ప్రాక్టీస్ కొనసాగించవచ్చు. లీగల్ రిపోర్టర్, లీగల్ ఎనలిస్ట్‌గానూ సేవలందించవచ్చు.

ఐఐఎం రోహ్‌తక్‌లో..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), రోహ్‌తక్ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు 2021-2022 విద్యా సంవత్సరం నుంచి అందిస్తోంది. పదో తరగతి, ఇంటర్‌లో 60 (ఎస్సీ, ఎస్టీలు 55) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులు. ప్రవేశానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఈ సంస్థ నిర్వహించే పరీక్షతో అవకాశం కల్పిస్తారు. పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ, లీగల్ రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ 10లోగా నమోదు చేసుకోవాలి. క్లాట్ స్కోరుతోనూ అవకాశం ఉంది. ఏప్రిల్ 20లోగా వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఐపీఎం/క్లాట్‌లో సాధించిన స్కోరుకు 45 శాతం, ఇంటర్వ్యూకి 15, పదోతరగతి, ఇంటర్ మార్కులకు 40 శాతం వెయిటేజీ ఉంటుంది. పూర్తి వివరాలకు https://www.iimrohtak.ac.in/ చూడవచ్చు.

ఉన్నత విద్య

జాతీయ, ప్రముఖ సంస్థల్లో పీజీ కోర్సు (ఎల్ఎల్ఎం) ఏడాదికే పూర్తవుతుంది. రాష్ట్రస్థాయి సంస్థల్లో మాత్రం పీజీ వ్యవధి రెండేళ్లు. ఇందులో పలు స్పెషలైజేషన్లు ఉన్నాయి. బిజినెస్, హ్యూమన్ రైట్స్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ, కాన్‌స్టిట్యూషనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్, బిజినెస్ అండ్ క్రిమినల్, కార్పొరేట్, ఎన్విరాన్‌మెంటల్, ఫ్యామిలీ, పాలసీ అండ్ గుడ్ గవర్నెన్స్...మొదలైనవి ముఖ్యమైనవి. స్పెషలిస్ట్ సేవలు అందించాలనుకునేవారు ఎల్ఎల్ఎంలో చేరాలి. అనంతరం ఆసక్తి ఉంటే పీహెచ్‌డీలో చేరవచ్చు. బోధన రంగంలో రాణించడానికి పరిశోధన పట్టా ఉపయోగపడుతుంది.

ఇవీ పరీక్షలు...

న్యాయవిద్యలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షల్లో ముఖ్యమైంది కామన్ లా ఎంట్రన్స్ టెస్టు (క్లాట్). ఇందులో సాధించిన స్కోరుతో దేశవ్యాప్తంగా ఉన్న 22 జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం లభిస్తుంది. ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి నల్సార్, హైదరాబాద్; దామోదరం సంజీవయ్య జాతీయ లా కళాశాల, విశాఖపట్నం ఉన్నాయి. పేరొందిన ప్రైవేటు సంస్థల్లో ప్రవేశానికీ క్లాట్ స్కోరు ఉపయోగపడుతుంది. భారత్‌లో కొన్ని సంస్థలతోపాటు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో న్యాయవిద్యలో ప్రవేశానికి ఎల్‌శాట్ స్కోరు ఉపయోగపడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో లాసెట్ నిర్వహిస్తున్నారు. ఈ స్కోరుతో రాష్ట్ర స్థాయి ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరవచ్చు. లా ప్రవేశ పరీక్షల్లో ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, లీగల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అభ్యర్థిలో గ్రహణ, తార్కిక నైపుణ్యాలు, సామర్థ్యాలను మూల్యాంకనం చేస్తారు. న్యాయవిద్య అభ్యసించడానికి అవసరమైన ఆప్టిట్యూడ్, స్కిల్స్ ఉన్నాయా? లేవా? అనేది ప్రవేశ పరీక్షల ద్వారా గమనిస్తారు.

కావాల్సిన నైపుణ్యాలు

క్లిష్టమైన, విస్తృతంగా ఉన్న సమాచారాన్ని చదివి అర్థం చేసుకునే నైపుణ్యం లా గ్రాడ్యుయేట్లకు ఉండాలి. అలాగే తార్కిక పరిజ్ఞానం తప్పనిసరి. విశ్లేషణ, రాత నైపుణ్యాలు బాగుండాలి. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, తెలివిగా మాట్లాడటం తప్పనిసరి. అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరిచే సామర్థ్యం అవసరం.

పేరున్న సంస్థలు..

దేశంలో న్యాయవిద్యకు నేషనల్ లా యూనివర్సిటీలతోపాటు మరికొన్ని సంస్థలు పేరొందాయి. వాటిలో ముఖ్యమైనవి... దిల్లీ యూనివర్సిటీ, ఫ్యాకల్టీ ఆఫ్ లా; బెనారస్ యూనివర్సిటీ, వారణాసి; గవర్నమెంట్ లా కాలేజ్, ముంబై; ఐఎల్ఎస్ లా కాలేజ్, పుణె; సింబయాసిస్, పుణె; ఐఐటీ ఖరగ్‌పూర్. వీటిలో ప్రవేశాల కోసం విడిగా దరఖాస్తు చేసుకోవాలి.

పరీక్ష ఇలా

టీఎస్/ఏపీ లాసెట్ 120 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. 120 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. పార్ట్-ఎ జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు, పార్ట్-బి కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు, పార్ట్-సి లా ఆప్టిట్యూడ్‌లో 60 ప్రశ్నలు వస్తాయి. ఇందులో 10 ప్రశ్నలు లీగల్ ఆప్టిట్యూడ్‌పై ప్యాసేజ్ రూపంలో ఉంటాయి. పార్ట్-సి ప్రశ్నలు లా, భారత రాజ్యాంగంలో ప్రాథమికాంశాలపై ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. కొన్ని జతచేసేవీ ఉంటాయి. రుణాత్మక మార్కులు లేవు. ప్రశ్నలు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో అడుడుతారు. మాక్ టెస్టు అందుబాటులో ఉంచారు.

ఐదేళ్ల లా పరీక్షలో ప్రశ్నలు ఇంటర్మీడియట్ స్థాయిలో, మూడేళ్ల లాకు యూజీ స్థాయిలో ఉంటాయి. టీఎస్ లాసెట్‌ను ఉస్మానియా, ఏపీ లాసెట్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్నాయి.

దరఖాస్తులు..

టీఎస్ లాసెట్: దరఖాస్తులు అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 6 వరకు స్వీకరిస్తారు. పరీక్ష మే 25న.
ఏపీ లాసెట్: దరఖాస్తులు ఏప్రిల్ 22 వరకు. పరీక్ష మే 20న.
అర్హత: టీఎస్, ఏపీ ఐదేళ్ల ఎల్ఎల్బీ కోర్సులకు ఇంటర్మీడియట్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీసీలు 42, ఎస్సీ, ఎస్టీలైతే 40 శాతం ఉన్నా సరిపోతుంది. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారూ అర్హులే. పాలిటెక్నిక్ డిప్లొమాతోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. లాసెట్‌లో అర్హతకు 35 శాతం మార్కులు తప్పనిసరి. మూడేళ్ల లా కోర్సులకు డిగ్రీ విద్యార్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు.
ఏపీ https://cets.apsche.ap.gov.in/
తెలంగాణ https://lawcet.tsche.ac.in/

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

ఏపీ పీజీసెట్ 2023

ఏపీ పీజీసెట్ ప్రకటన వెలువడింది. కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంసీజే, ఎంఎల్ఐబీఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీటెక్ తదితరాలు.
అర్హత: సంబంధిత బ్యాచిలర్ డిగ్రీ / చివరి ఏడాది పరీక్ష రాస్తున్నవారు.
పరీక్ష ఫీజు: జనరల్ కేటగిరీలకు రూ.850; బీసీలకు రూ.750; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.650.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11-05-2023.
ప్రవేశ పరీక్షలు ప్రారంభం: 06-06-2023.
వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in/APPGCET2023/UI/HomePages/Home

సాంకేతిక కోర్సుల్లో ఉపాధి శిక్షణ

యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ... మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఏపీ, తెలంగాణ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజనం, వసతి కల్పిస్తారు.
1. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్/ ఎలక్ట్రానిక్ వస్తువు రిపేర్- సీసీటీవీ టెక్నీషియన్. అర్హత: ఇంటర్మీడియట్ పాస్/ ఫెయిల్
2. ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్/ సర్వీస్. అర్హత: ఐటీఐ, డిప్లొమా.
3. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజీ, బ్యాగ్స్ మేకింగ్. అర్హత: ఎనిమిదో తరగతి పాస్.
కోర్సుల వ్యవధి: ఆరు నెలలు. వయసు: 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
దరఖాస్తు: ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్, నకళ్లు, ఫొటోలతో సంస్థ చిరునామాలో సంప్రదించాలి.
అడ్మిషన్ తేదీ: 10.04.2023 ఉదయం 10 గంటలు.
చిరునామా: స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్ (గ్రామం), పోచంపల్లి (మండలం), యాదాద్రి భువనగిరి జిల్లా.
వివరాలకు: ఫోన్ నంబర్ 9133908000
వెబ్‌సైట్: https://www.srtri.com/index.php

నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీలో..

గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ... 2023 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.
1. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ): ఫోరెన్సిక్స్, దాని అనుబంధ శాస్త్రాలు
2. ఎంఎస్సీ (విభాగాలు: ఫోరెన్సిక్ సైన్స్/ ఫోరెన్సిక్ బయోటెక్నాలజీ/ మల్టీమీడియా ఫోరెన్సిక్స్/ టాక్సికాలజీ/ సైబర్ సెక్యూరిటీ/ డిజిటల్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ/ న్యూరో సైకాలజీ/ క్లినికల్ సైకాలజీ/ ఫోరెన్సిక్ సైకాలజీ/ నానోటెక్నాలజీ/ ఫుడ్ టెక్నాలజీ/ హోంల్యాండ్ సెక్యూరిటీ/ కెమిస్ట్రీ/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ).
3. ఎంఏ (విభాగాలు: మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం/ క్రిమినాలజీ/ పోలీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్)
4. బీఎస్సీ- ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్
5. పీజీ డిప్లొమా (విభాగాలు: ఫింగర్‌ప్రింట్ సైన్స్/ ఫోరెన్సిక్ డాక్యుమెంట్ ఎగ్జామినేషన్/ క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ/ క్రైమ్ సీన్ మేనేజ్‌మెంట్/ డీఎన్ఏ ఫోరెన్సిక్స్/ ఫోరెన్సిక్ జర్నలిజం/ ఫోరెన్సిక్ బాలిస్టిక్స్/ హ్యూమానిటేరియన్ ఫోరెన్సిక్స్/ డిజాస్టర్ విక్టిమ్ ఐడెంటిఫికేషన్/ సైబర్ ఫిజికల్ సిస్టమ్/ సెమీకండక్టర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్/ సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ ఇన్వెస్టిగేటివ్/ సైబర్ సైకాలజీ/ ఇన్వెస్టిగేటివ్ సైకాలజీ/ సెక్యూరిటీ స్టడీస్/ సైబర్ లా/ డ్రగ్ అండ్ సబ్‌స్టాన్స్ అబ్యూస్ లాస్/ ఇంటర్నెట్ గవర్నెన్స్/ ఇండస్ట్రియల్ సేఫ్టీ, హైజీన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్.
6. ఎంటెక్ (విభాగాలు: సైబర్ సెక్యూరిటీ/ ఏఐ అండ్ డీఎస్/ సివిల్ ఇంజినీరింగ్/ రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్/ అప్లైడ్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)
7. బీటెక్- ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్
8. ఎంబీఏ (విభాగాలు: ఫోరెన్సిక్ అకౌంటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/ సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్/ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్/ బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్)
9. బీబీఏ- ఎంబీఏ (విభాగాలు: ఫోరెన్సిక్ అకౌంటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/ బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్)
10. ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ 11. బీఏ- ఎంఏ క్రిమినాలజీ
11. డిప్లొమా కన్నెన్ ఫోరెన్సిక్స్
12. ఎల్ఎల్ఎం (విభాగాలు: సైబర్ లా అండ్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్/ క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ అడ్మినిస్ట్రేషన్)
13. బీఎస్సీ- ఎల్ఎల్బీ (ఆనర్స్) 15. ఎల్ఎల్బీ (ఆనర్స్)
14. బీబీఏ- ఎల్ఎల్బీ (ఆనర్స్)
15. ఎంఫార్మసీ(ఫోరెన్సిక్ ఫార్మసీ/ ఫార్మాస్యూటికల్ క్వాలిటీ అస్యూరెన్స్)
క్యాంపస్‌లు: గాంధీనగర్, దిల్లీ, గోవా, త్రిపుర, భోపాల్, పుణె, గువాహటి, మణిపూర్, ధార్వాడ్
అర్హత: సంబంధిత విభాగంలో 10+2, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ.
ఎంపిక: పీజీ డిప్లొమా ప్రోగ్రాంలో విద్యార్హత మార్కుల ఆధారంగా. మిగిలిన కోర్సులకు వర్సిటీ నిర్వహించే నేషనల్ ఫోరెన్సిక్ అడ్మిషన్ టెస్ట్ (ఎన్ఎఫ్ఏటీ)-2023, అకడమిక్ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 29-05-2023.
ప్రవేశ పరీక్ష తేదీలు: 01, 02-07-2023.
వెబ్‌సైట్: https://nfsu.ac.in/admission

తాజా ఇంటర్న్‌షిప్‌లు

విజయవాడలో

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్

సంస్థ: ది స్వస్తిక్ ఫార్మాస్యూటికల్స్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10
అర్హతలు: అడ్వినో, సర్క్యూట్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ నైపుణ్యాలు
☛ internshala.com/i/b99034

సాఫ్ట్‌వేర్ ఎనలిటిక్స్

సంస్థ: పింక్‌మూన్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 6
అర్హతలు: ఎక్స్‌ప్రెస్.జేఎస్, ఎంఎస్-ఎక్సెల్, మైఎస్క్యూఎల్ సర్వర్, రియాక్ట్‌జేఎస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/98936d

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్

సంస్థ: ది స్వస్తిక్ ఫార్మాస్యూటికల్స్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 4
అర్హతలు: ఆండ్రాయిడ్, సి++ ప్రోగ్రామింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, హెచ్‌టీఎంఎల్, జావా, జావాస్క్రిప్ట్, మైఎస్క్యూఎల్, పైతాన్ నైపుణ్యాలు
☛ internshala.com/i/7304b0

ఎలక్ట్రికల్ వెహికల్స్ మార్కెట్ సర్వే

సంస్థ: ఓయూఎన్‌సీ
స్టైపెండ్: నెలకు రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, రిసెర్చ్ అండ్ ఎనలిటిక్స్, సేల్స్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/00ac17

విశాఖపట్నంలో

యూట్యూబ్ క్రియేషన్

సంస్థ: అయనింక్స్
స్టైపెండ్: నెలకు రూ.6,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 6
అర్హతలు: వీడియో మేకింగ్ నైపుణ్యం
☛ internshala.com/i/7e2437

కేవీలు పిలుస్తున్నాయి!

విద్యార్థుల్లో సమగ్ర వికాసానికి చిరునామాగా నిలుస్తున్నాయి.. కేంద్రీయ విద్యాలయాలు. ఒకటో తరగతిలో ప్రవేశం పొందితే, ప్లస్ 2 వరకు నిశ్చింతగా చదువుకోవచ్చు. సీబీఎస్ఈ కరిక్యులమ్‌తో ఒత్తిడి లేని నాణ్యమైన విద్యను నామమాత్రపు రుసుముతో పొందవచ్చు. సువిశాల ప్రాంగణాలు, సుశిక్షితులైన బోధన సిబ్బంది, ఆటస్థలం, అన్ని సౌకర్యాలు...కేవీల ప్రత్యేకత. ఈ సంస్థల్లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది!

నామమాత్ర రుసుముతో నాణ్యమైన విద్య

చిన్నారుల్లో సమగ్ర వికాసం ఆశించే తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రీయ విద్యాలయాల్లో చేర్చడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. వీటిలో సీటు పొందడం కష్టమైనప్పటికీ, ఎంపిక పారదర్శకం కాబట్టి ఒకటో తరగతిలో తమ పిల్లలను చేర్చాలనుకున్నవారు ప్రయత్నించవచ్చు. మిగిలిన తరగతుల్లో ఖాళీలు ఉంటేనే అవకాశం కల్పిస్తారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆరేళ్లు పూర్తవ్వడం తప్పనిసరి. గత విద్యా సంవత్సరం (2022-23) నుంచి కేంద్రీయ విద్యాలయాలు ఈ నిబంధనను అమలు చేస్తున్నాయి. అలాగే గతంలో గరిష్ఠంగా ఏడేళ్ల లోపు వారికే ప్రథమ తరగతిలో ప్రవేశం లభించేది. ఇప్పుడు ఎనిమిదేళ్ల వరకు ఆ అవకాశం ఉంది.

సీట్లు ఇలా...

ప్రతి పాఠశాలలోనూ ఒకటో తరగతిలో ఒక సెక్షన్ ఉంటుంది. ఒక్కో సెక్షన్‌లోనూ ఆ పాఠశాల ఉన్న ప్రాంతాన్ని బట్టి కనీసం 20 నుంచి 60 వరకు సీట్లు లభిస్తున్నాయి. పలు పాఠశాలల్లో ఫస్ట్ క్లాస్‌లో రెండు నుంచి ఐదు సెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. మరికొన్ని చోట్ల ఉదయం, మధ్యాహ్నం షిఫ్ట్‌ల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సెక్షన్లు, షిఫ్ట్‌ల కారణంగా ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశం దక్కుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను ముందుగా భర్తీ చేస్తారు. ఇందు కోసం వచ్చిన అన్ని దరఖాస్తులను కలిపి డ్రా తీస్తారు. ఈ విధానంలో ఎంపికైనవారికి ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. 15 శాతం సీట్లు ఎస్సీలకు, 7.5 శాతం ఎస్టీలకు కేటాయించారు. అలాగే 27 శాతం సీట్లు ఓబీసీ నాన్ క్రీమీ లేయర్‌తో నింపుతారు. రెండు సీట్లు సింగిల్ గర్ల్ చైల్డ్ (తల్లిదండ్రులకు సంతానంగా ఒక కుమార్తె మాత్రమే ఉన్నవారు)కి ఉన్నాయి. దివ్యాంగులకు 3 శాతం సీట్లు లభిస్తున్నాయి. వీటిని ఆ సమూహానికి చెందిన దరఖాస్తుల నుంచి లాటరీతో భర్తీ చేస్తారు. ఇంకా సీట్లు మిగిలితే వచ్చిన దరఖాస్తులన్నీ కలిపి లాటరీ విధానంలోనే కేటాయిస్తారు.

ఒకటో తరగతి ప్రవేశాలకు ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. రెండో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు ఆ పాఠశాల ప్రిన్సిపల్, కమిటీ సభ్యుల సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. తొమ్మిదో తరగతిలో చేరడానికి పరీక్ష నిర్వహిస్తారు. అలాగే ప్లస్ 1లో ప్రవేశాలు పదో తరగతి పరీక్షల్లో సాధించిన మార్కులతో చేపడతారు. తొలి ప్రాధాన్యం కేంద్రీయ విద్యాలయాల్లో చదివినవారికే ఇస్తారు. సీట్లు మిగిలితే ఇతర బోర్డులవారికి అవకాశం కల్పిస్తారు.

ఎవరికి ప్రాధాన్యం?

సీట్ల కేటాయింపులో కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ, పారా మిలటరీలో పనిచేస్తున్నవారి పిల్లలకు ప్రాధాన్యం లభిస్తుంది. తరచూ బదిలీలు జరిగేవారు, పబ్లిక్ సెక్టార్ కంపెనీలు, స్వయంప్రతిపత్తి సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు...మొదలైన చోట్ల పనిచేసే ఉద్యోగుల చిన్నారులకు ఆ తర్వాతి ప్రాధాన్యం. ప్రతి ఎంపీ (లోక్‌సభ) తన పరిధిలోని కేంద్రీయ విద్యాలయకు ఏడాదికి పది మందిని సిఫార్సు చేయవచ్చు. రాజ్యసభ సభ్యులైతే వారు ప్రాతినిధ్యం వహిస్తోన్న రాష్ట్రం పరిధిలో ఉన్న కేవీల్లోకి పది మందికి అవకాశం కల్పించవచ్చు. ఇలా ఎంపీలు ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలను కేవీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి ఆ కేవీలకు అనుమతి పత్రాలు వస్తే సీట్లను కేటాయిస్తారు. కేంద్ర మానవ వనరుల శాఖ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతోద్యోగులు, రిసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్...విభాగాలవారీ కొన్నేసి సీట్లు చొప్పున కోటా ఉంటుంది.

దరఖాస్తులు

ఒకటో తరగతిలో ప్రవేశానికి విద్యార్థి వయసు మార్చి 31, 2023 నాటికి ఆరేళ్లు పూర్తికావాలి (ఏప్రిల్ 1 నాటికి పూర్తయినా పరిగణనలోకి తీసుకుంటారు) అలాగే ఎనిమిదేళ్లకు మించరాదు. తర్వాతి తరగతులకు ఒక్కో ఏడాదీ కలపాలి. దరఖాస్తుకి ముందుగా ప్రాథమిక సమాచారం నమోదు చేయాలి. ఆ తర్వాత లాగిన్‌తో మిగ